
# మదర్స్ డే

"వాళ్ళు వెళ్ళిపోయి చాలాసేపు అయింది. ఇక మీరు లోపలికి రండమ్మా" ఆయా మాటలతో ఈ లోకంలోకి వచ్చింది జానకమ్మ. 'కొడుకును కోడలును సాగనంపటానికి గేటుదాకా వచ్చిన తను అలాగే నిలుచుండిపోయిందన్న మాట' అని అనుకుంటూ వీధిలోకి ఒకమారు చూసి, గేటు మూసి తన గదిలోకి వచ్చింది. మంచం మీద కొడుకు తెచ్చిన పండ్లు, కోడలు తెచ్చిన చీర జాకెట్టు పాకెట్టులు పడి ఉన్నాయి. నిర్లిప్తంగా వాటి వైపు చూసింది.



ఉదయం 12 గంటల నుండి, మధ్యాహ్నం 4 గంటల వరకు కబుర్లతో, నవ్వులతో చైతన్యం అయిన వాతావరణం మరల స్మశాన నిశబ్దంగా మారింది. 'మదర్స్ దే' సందర్భంగా కొడుకు, కోడలు వృద్ధాశ్రమంలో నున్న జానకమ్మను చూసి చీరలు, పండ్లుఇచ్చి వెళ్ళారు.

మదర్స్‌డే..టీచర్సుడే, చిల్డ్రన్స్‌డే లాగ మదర్స్‌డే...టీచర్స్‌డే అయితే ఆరోజు జన్మించిన మహానుభావులను గుర్తుకు తెచ్చుకొని, వారి ఆశయాల సాధనకు పునరంకితం కావటానికి జరుపుకొంటున్నాం. కాని...మదర్స్‌డే బ్రతికున్న తల్లుల అస్తిత్వాన్ని ఆ ఒక్కరోజు..ఆ ఒక్క రోజు మాత్రమే గుర్తుతెచ్చుకొని, గిఫ్టులు ఇవ్వటం..అంతటితో తమ బాధ్యత అయిపోయిందని మురిసిపోవటం ఎంత దౌర్భాగ్యం.

అమ్మ.. పిల్లలతో ఆమె సంబంధాలు ఎంతో ప్రత్యేకం. అలాంటి అమ్మకు ఒక్కరోజు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి, పండుగ జరుపుకొని, మిగిలిన రోజులు ఆమె ఉనికిని మరిచిపోవటం ఎంత అనాగరికత..

భర్తపోయినప్పటినుండి జానకమ్మ కొడుకును ఎంతో కష్టపడి పెంచి, పెద్దజేసింది. కొడుకు పెద్ద చదువులు చదువుకొని, మంచి ఉద్యోగం సంపాదించినరోజు ఎంతో మురిసిపోయింది. ఇక తన కష్టాలు గట్టెక్కినట్టే అనుకొంది కానీ, అప్పుడే మొదలయ్యాయి ఆమె కష్టాలు. మంచి ఉద్యోగం, బుద్ధిమంతుడు అయిన మోహన్‌ను శ్రీమంతుల కుమార్తె ప్రేమించి పెళ్ళి చేసుకున్నది. అత్తగారింటికి రావలసిన కోడలు, భర్తను అత్తగారింటికి రప్పించుకొన్నది. బాధ్యతను మరిచిపోలేని మోహన్ తల్లిని పేయింగ్ గెస్టుగా ఒక వృద్ధాశ్రమంలో ఉంచాడు. 'నీవు ఒంటరిగా ఒక్కదానివే ఉండలేవు' అంటూ.

అప్పటినుండి అరవై పడిలో పడిన జానకమ్మ పదేళ్ళుగా కొడుక్కి దూరంగా, బ్రతుకు భారంగా, రోజులు లెక్క పెట్టుకుంటూ గడుపుతున్నది. వృద్ధాశ్రమంలో చేర్చిన మొదట్లో నెలకొకమారు వచ్చేవాడు. తరువాత, తరువాత సంవత్సరానికి ఒకమారు ఈ మదర్స్‌డేన భార్యతో వచ్చి కొన్ని గంటలు కూర్చుని వెళతాడు.

పాశ్చాత్యదేశాలలో అయితే తల్లీ, పిల్లల మధ్య అటాచ్‌మెంట్స్ తక్కువ. అందువలన మదర్స్‌డే వారి సాంప్రదాయానికి సరిపోతుంది. కాని..మన సంస్కృతి వేరు..నవమాసాలు మోసి, కని, పెంచి, గోరుముద్దలు తినిపించి, నడకనేర్పించి, మొదటి గురువై విద్యాబుద్ధులు నేర్పించిన అమ్మకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం. ఆమె చివరి రోజులలో ప్రశాంతంగా బ్రతకటానికి అవసరమయిన ప్రేమను అందించటం తప్ప. అటువంటి అమ్మకు 'మదర్స్‌డే' అని, ఆ ఒక్కరోజు తాము తమ ప్రేమను అమ్మపట్ల ఎంత విలక్షంగా చాటుకోగలం అని ఆలోచించి ఒక గిఫ్ట్ ఇచ్చి అంతటితో తమ బాధ్యతను తీర్చుకొని అందిస్తున్నారు చాలామంది..ఆమె కళ్ళల్లో తడి మెరిసింది. కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నవి. ఆ కన్నీటి మసకలతో ఆమె చేతులు గిఫ్టుపాక్‌ను ఆప్యాయంగా తడిమాయి. కొడుకును తాకినంత అనుభూతి కలిగింది ఆమెకు. 'మదర్స్‌డే.. ఈ సంవత్సరానికి అయిపోయింది. మరల కొడుకును చూడాలంటే మళ్ళీ వచ్చేసంవత్సరం. తను బ్రతికి బాగుంటే..అప్పటివరకు తను ఎదురుచూడాలి' అనుకొంది ఆవేదనగా. 'ఎవరైనా మహానుభావులు ఇటువంటి పండుగలను నెలకొకసారి జరుపుకొనే సాంప్రదాయాన్ని ప్రారంభిస్తే బాగుండు..' అనుకొంది ఆశగా.

-పి. హేమలతాకుమారి (జి.కొండూరు)

